## క్లుప్తంగా

### జాషువాకు ఘన నివాళి



జాషువాకు నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): విశ్వకవి, పద్మభూషణ్ గుర్రం జాషువా 54వ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి సమీపంలోని ఎస్సీ ఎస్టీ బహుజన రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ కార్యాలయంలో గురువారం జాషువా చిత్రపటానికి ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ మోనిటరింగ్ జిల్లా కమిటీ మాజీ సభ్యులు మేతర అజయ్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆధునిక తెలుగు కవులలో సుస్థిర స్థానం సంపాదించిన మహాకవి గుర్రం జాషువా అని కొనియాడారు. ఆయన సమాజ మార్పు కోసమే కవిత్వాలు రచించారని గుర్తుచేశారు. వడ గాల్పులు నా జీవితం అయితే వెన్నెల నా కవిత్వం అన్నారని, ఆయన ఆశ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మేతర అశోక్, జాకబ్, ఎం నాగరాజు, ఎస్ వీరయ్య, కలుకుటి గురవయ్య, అబ్రహం, వేణు, రెడ్డి బాబు తదితరులు పాల్గొన్నారు.

### పంచాయతీ కార్మికుల సమస్యలపై వినతి



డీపీఓకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): గ్రామ పంచాయతీల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, టెండర్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు గురువారం డీపీఓ అనురాధకు వినతి పత్రం అందజేశారు. పంచాయతీల్లో పంపు ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, పారిశుద్ధ్య కార్మికులు, గుమస్తాలు, అటెండర్లు తదితర ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు కావడం లేదని పేర్కొన్నారు. పంచాయతీ కార్మికులు ఏటా టెండర్ పేరుతో తమ ఉపాధిని కాపాడుకోవాల్సి వస్తుందని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు కొబ్బరి నూనె, చెప్పులు, చేతి గ్లౌజులు, యూనిఫామ్ వంటి కనీసం సౌకర్యాలు అందడం లేదని వివరించారు. రాజకీయ ఒత్తిళ్లు, టెండర్ ప్రక్రియ పేరుతో అక్రమ తొలగింపులు ఆపాలని, కార్మికులకు ప్రతినెలా 5వ తేదీ నాటికి జీతాలు చెల్లించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డీపీఓ హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడుఆర్ శ్రీనివాస్ డాంగే, ఏపీ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.కిషోర్, ఏఐటీయూసీ ఏలూరు ఏరియా కార్యదర్శి ఎ.అప్పలరాజు పాల్గొన్నారు.

# ఏలూరులో కుండపోత వర్షం

- గురువారం రోజంతా వానే
- రోడ్లపై ప్రవహించిన నీరు
- ఇబ్బందులు పడ్డ ప్రజలు



ఏలూరులో వర్షంలో వెళుతున్న వాహనచోదకులు



నీట మునిగిన ఏలూరు పవరుపేట రోడ్డు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మూడు రోజుల క్రితం వరకు వేసవిని తలపించిన వాతావరణం బుధ, గురువారాల్లో కురిసిన వర్షానికి ఒక్కసారిగా చల్లబడింది. సోమవారం వరకు విపరీతమైన ఎండలతో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదై ప్రజలు రెండో వేసవిని ఎదుర్కొన్నారు. అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వానలతో ఏలూరు నగర ప్రజలు సేదతీరారు. వాతావరణంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో బుధవారం సాయంత్రం నుంచి ప్రారంభమైన వాన గురువారం కూడా కొనసాగింది. బుధవారం ఉదయం కొద్దిసేపు నగరంపైకి సూర్యుడు తొంగి చూసినా గురువారం కనిపించలేదు. మధ్యాహ్నం 12 గంటలకు ఆకాశమంతా మేఘావృతమై సాయం సంధ్యవేళలా వాతావరణం మారింది. 12.30 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా కుండపోత వాన కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. రోజంతా ఎడతెరిపి లేని వర్షం కురుస్తూనే ఉండడంతో ప్రజలు ఎక్కడి వారు అక్కడే ఉండిపోయారు. సాయంత్రం విద్యాసంస్థలు విడిచిపెట్టే సమయానికి కూడా వర్షం తగ్గుముఖం పట్టకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తడుస్తూనే రాకపోకలు సాగించారు. మరో రెండు రోజుల పాటు వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ ప్రకటించింది.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

వీధులు, ప్రధాన రహదారులు వాననీటికి మునిగిపోవడం నగర ప్రజలకు అలవాటుగా మారిపోయింది. నగరపాలక సంస్థ పారిశుద్ధ్య విభాగం సూపర్‌వైజర్లు పట్టించుకోకపోవడంతో డ్రెయినేజీలన్నీ సిల్టుతో పూడుకుపోయాయి. పారిశుద్ధ్య కార్మికులు డ్రెయినేజీల్లోని మురుగు, మట్టిని తొలగించకుండా నీటిపై తేలియాడే ఆకులు, పాలిథిన్ సంచులను మాత్రమే పక్కకు తొలగిస్తుండడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. డ్రెయినేజీలోసిల్టును ఎప్పటికప్పుడు తొలగిస్తే భారీ వర్షం కురిసినా నీరు దిగువకు ప్రవహించి రోడ్లు జలమయమయ్యే పరిస్థితి ఉండదని సూచిస్తున్నారు. ఇప్పటికైనా పారిశుద్ధ్య కార్మికులతో డ్రెయిన్లలోని మురుగును, మట్టిని తొలగించే ఏర్పాట్లు చేయాలని ప్రజలు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

## కారుమూరి వాహనాన్ని అడ్డుకోవడం తగదు



సొంగా సందీప్, వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలూరు (టూటౌన్): మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కాన్వాయ్ వాహనాన్ని అడ్డుకుని ప్రచార రథంపైకి ఎక్కి దివంగత నేత, సంక్షేమ ప్రదాత వైఎస్సార్, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలను తొక్కుతూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను రెచ్చగొట్టేలా చేష్టలు చేయడం ఎంతవరకు సమంజసమని వైఎస్సార్ సీపీ నేత, లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ సొంగా సందీప్ ప్రశ్నించారు. స్థానిక అశోక్‌నగర్‌లోని తన నివాసంలో గురువారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడారు. హరిహర వీరమల్లు సినిమా రిలీజ్ సందర్భంగా బైక్ ర్యాలీ పేరుతో వాహనదారులను ఇబ్బంది పెడుతూ తణుకులో హడావుడి చేయడం ఇదేనా సంస్కారం అని నిలదీశారు. పవన్ కళ్యాణ్ అభిమానులు, జనసేన కార్యకర్తలు ఈ విధంగా చేయడం ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారో అర్థం కావట్లేదని ఎద్దేవా చేశారు. వీలైతే ప్రజలకు మేలు చేయటానికి సహకరించండి కానీ కీడు మాత్రం చేయద్దని హితవుపలికారు. ఈ రాష్ట్రంలో ఆడపిల్లలపై అత్యాచారాలు, హత్యలు, కిడ్నాప్‌లు, దాడులు జరుగుతుంటే వాటిని అదుపులో పెడతామని, ఎన్నికల ముందు ఎన్నో మీటింగ్‌లలో మైక్‌లలో అరిచి చెప్పిన పవన్ కళ్యాణ్ ఇపుడు నోరు ఎందుకు మెదపట్లేదని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను డైవర్షన్ పాలిటిక్స్ చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యఅని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపించేందుకు, ప్రజలకు మేలు చేయడానికి చంద్రబాబు తన అనుభవాన్ని ఉపయోగించాలే తప్ప వైఎస్సార్ సీపీ శ్రేణులను టార్గెట్ చేసి అక్రమంగా కేసులు పెట్టి అరెస్టు చేయించడం, దాడులు చేయించడం బాధాకరమని వివరించారు. కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులకు రక్షణ లేకుండా పోయిందని, తమ ప్రభుత్వం వచ్చాక తగినంత మూల్యం చెల్లించుకోకతప్పదని ఆ పార్టీలను సందీప్ హెచ్చరించారు.

## శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఐ కోటేశ్వరరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పోలీస్‌శాఖ అభివృద్ధి చేసిన అత్యవసర భద్రత యాప్ శక్తి అని, ఎస్‌ఓఎస్ బటన్‌పై నొక్కితే తక్షణమే సంకేతం ద్వారా ఆపదలో ఉన్నవారిని రక్షించవచ్చని త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు అన్నారు. గురువారం శనివారపు పేట హైస్కూల్లో శక్తియాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళలు ఒంటరిగా ప్రయాణిస్తున్నప్పుడు, వేధింపులు, గృహహింస వంటి పరిస్థితుల్లో 112, 100, 181 వంటి హెల్ప్‌లైన్ నెంబర్లకు నేరుగా కాల్ చేసే సదుపాయం ఉందని అన్నారు. గూగుల్ ప్లేస్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని మొబైల్ నెంబర్‌తో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. మహిళలందరూ తమ ఫోన్ లో తప్పనిసరిగా ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. శక్తి టీమ్ సభ్యులు స్కూళ్లు, కాలేజీల వద్ద గస్తీ నిర్వహిస్తూ విద్యార్థినులకు భద్రత కల్పిస్తూ శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు.

# మిథున్‌రెడ్డి అరెస్ట్ కక్ష సాధింపులో భాగమే




సమావేశంలో మాట్లాడుతున్న జాన్ వెస్లీ

ఏలూరు (టూటౌన్): టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి 13 నెలల గడుస్తున్నా ప్రజలకు చేసింది ఏమీ లేదని, ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కటమే చంద్రబాబు దినచర్యగా మారిందని, ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ కక్ష సాధింపు చర్యల్లో భాగమేనని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ ఆరోపించారు. వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడ్డాక పేదల జీవన ప్రమాణాలు మరింత దిగజారాయని, జీఎస్టీ వసూలు క్షీణించిందని, రాష్ట్ర జీడీపీ రేటు పడిపోయిందని, తలసరి ఆదాయం తగ్గిందని వివరించారు. ఎన్నికల ముందు సంపద సృష్టించి పథకాలు అమలు చేస్తానని చెప్పి, ఇప్పుడేమో పథకాలు అమలు చేయలేక రాష్ట్రాన్ని అమ్ముతాం అంటున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని దిగజార్చినా, పథకాలు అమలు చేయకపోయినా, సహించేది లేదని వైఎస్సార్ సీపీ తరపున ప్రజల పక్షాన పోరాడుతామని ఆయన హెచ్చరించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఎక్కడికెళ్లినా ప్రజలు నిరాజనాలు పడుతున్నారని, జగన్ పోరాటాల వల్లే అమ్మఒడిని చంద్రబాబు ఇచ్చారని తెలిపారు. సమావేశంలో పార్టీ చింతలపూడి అసెంబ్లీ ఇన్‌చార్జి కంభం విజయ రాజు, క్రిస్టియన్ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు పిల్ల చరణ్, జిల్లా ఉపాధ్యక్షుడు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు, దాసి ఏసుబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మున్నుల జాన్ గుర్నాథ్, జాన్సన్, వెంపా ఐజాక్, గున్నం డేవిడ్, కరుణానిధి, చంద్రకుమార్, కృష్ణారావు, దాసరి రమేష్, వనమా అనిల్, మురళి జిల్లా ఆర్టిఐ విభాగం అధ్యక్షుడు స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దెందులూరు: ఏలూరు మండలం చాటపర్రు, కొమడవోలు – పారేపల్లి ఫీడర్ల పరిధిలో లైన్ మరమ్మతుల నిమిత్తం ఈనెల 25, 26 తేదీల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ నరసయ్య తెలిపారు. చాటపర్రు, చాటపర్రు రోడ్డు, తిమ్మరగూడెం, కోటేశ్వరదుర్గాపురం, సీబీఎస్ కాలనీ పరిసర ప్రాంతాలకు కొమడవోలు, చాటపర్రు రోడ్డు, హమాలీ కాలనీ, దుర్గ గ్రాండ్ సిటీ, అందాలమ్మ తోట, రామనగర్, మరుతినగర్, మస్తాన్ మన్యం కాలనీ, నాగేంద్ర కాలనీ, శ్రీరాంనగర్ కాలనీ, శాస్త్రీ కాలనీ, చెంచుల కాలనీ, ఆటోనగర్, కొమరవోలు, తూర్పులాకులు, సాయి నగర్, ఎన్టీఆర్ కాలనీ, మల్కాపురం, ఇందిరమ్మ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

## నూకాలమ్మకు ఆషాఢ సారె సమర్పణ



సారెను ఊరేగింపుగా తీసుకువస్తున్న మహిళలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక 43వ డివిజన్ కొత్తపేట శ్రీ నూకాలమ్మవారికి ఆషాఢ మాసం అమావాస్య సందర్భంగా డివిజన్ ఇన్‌చార్జి దావాల రంగ సత్యనారాయణ, దేవాదాయ శాఖ, ఆలయ కమిటీ సభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో మహిళా భక్తులచే అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు. సుమారు 250 మందికిపైగా మహిళా భక్తులు 108 రకాల స్వీట్స్, ఫ్రూట్స్, పిండి వంటలు, చీర, జాకెట్టు, గాజులు, పసుపు, కుంకుమలతో మంగళ వాయిద్యాలతో నగర వీధులలో అమ్మవారి నామస్మరణతో భారీ ర్యాలీగా ఆలయానికి విచ్చేసి పుట్టినింటి నుంచి తెచ్చిన సారెను అమ్మవారికి సమర్పించి, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయానికి వివిధ రకాల కాయగూరలు, పువ్వులతో చేసిన శాకంబరి అలంకరణ ప్రత్యేక ఆకర్షణంగా నిలిచింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బడేటి చంటి సతీమణి బడేటి మీనా పాల్గొన్నారు. దావాల రంగా, జంపా సున్నారాయణ మిత్ర బృందం, సోషల్ వర్కర్ గొంతిన రామకృష్ణ, ఉల్లింగుల సురేష్, కరణం రాజు (ఇసుక రాజు), కొఠారి అప్పల కొండలరావు, కోలా సురేష్, నక్క నాగేశ్వరరావు, గొంతిన సర్వేశ్వరరావు, మాందారపు నాగేశ్వరరావు, సంబంగి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

| కూరగాయలు | కిలో ధర | కూరగాయలు | కిలో ధర |
|---|---|---|---|
| టమాటాలు | 46 | అరటి కాయ (1) | 06-08 |
| వంకాయలు (గులాబీ) | 16 | చిక్కుడు కాయలు | 40 |
| వంకాయలు (కాంతులు) | 24 | బీన్లచిక్కుడు | 100 |
| వంకాయలు (తెలుపు) | 28 | చామదుంపలు | 36 |
| బెండకాయలు | 26 | ములక్కాడలు | 08, 10 |
| పచ్చిమిర్చి | 74 | కంద | 00 |
| కాకర కాయలు | 30 | బీట్‌రూట్ | 38 |
| బీరకాయలు | 24 | కీరా దోస | 40 |
| బీరకాయలు (పందిరి) | 30 | ఫ్రెంచ్‌బీన్స్ | 80 |
| క్యాబేజీ | 26 | అల్లం | 60 |
| క్యారెట్ | 40 | కొత్తిమీర (కట్ట) | 20 |
| దొండకాయలు | 26 | పాలకూర | 12 |
| బంగాళదుంపలు | 30-32 | తోటకూర | 10 |
| ఉల్లిపాయలు | 26 | చుక్కకూర | 12 |
| గోరుచిక్కుడు | 36 | గోంగూర | 07-10 |
| దోసకాయలు | 24 | పుదీనా | 05 |
| అనబకాయ (1) | 10-15 | క్యాప్సికమ్ | 90 |
| పొట్లకాయ(1) | 25-30 | చిలకడదుంప | 40 |

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

**ఏసీ బస్సులు..**

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర) | 21.00 | 33 |
| ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర) | 21.30 | 23 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి) | 22.00 | 41 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్) | 22.30 | 23 |
| ఏలూరు - అమరావతి (ఇంద్ర) | 19.00 | రద్దు |

**సూపర్ లగ్జరీ**

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో 22సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ | 21.45 | 4820 | 21 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ | 21.15 | 4822 | 23 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 21 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం | 10.45 | 4798 | 28 |
| ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం | 21.15 | 4802 | 26 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం | 21.00 | 4804 | 36 |
| ఏలూరు -ఈసీఐఎల్ | 22.30 | 4814 | 33 |
| ఏలూరు - తిరుపతి | 16.00 | 4830 | 34 |

## గ్రంథాలయానికి కుర్చీల వితరణ



కుర్చీలను అందిస్తున్న కార్యదర్శి శేఖర్‌బాబు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అయ్యంకి వెంకటరమణయ్య 134వ జయంతి సందర్భంగా గురువారం స్థానిక అగ్రహారం బాలల గ్రంథాలయానికి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు రూ.15 వేలు విలువైన 27 ఫైబర్ కుర్చీలను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం శేఖర్‌బాబు చేతులు మీదుగా అందజేశారు. తొలుత అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శేఖర్‌బాబు మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమ సమయంలో వారు చేసిన కృషి ఫలితంగా అనేక నూతన గ్రంథాలయాలు ఏర్పడ్డాయన్నారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కారం శెట్టి రమేష్ బాబు, కమిటీ సభ్యులు వత్రికొండలరావు, గ్రంథాలయ నిర్వాహకురాలు ఎం శోభ, పాఠకులు పాల్గొన్నారు. అనంతరం వార్షిక తనిఖీలో భాగంగా కార్యదర్శి బాలల గ్రంథాలయంలో రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తపరిచారు.

## పుస్తక పఠనం పెంపొందించుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : నేటి విద్యార్థులు ఇంటర్నెట్‌లోనే సమస్త సమాచారాన్ని పొందుతున్నారని, గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం చేయడం తగ్గిందని, దానిని పెంపొందించుకోవాలని ప్రధాన వక్త బీకేఎస్‌ఆర్ అయ్యంగార్ అన్నారు. గురువారం సర్ సీఆర్‌రెడ్డి కళాశాలలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య పంతులు 135వ జయంతి కార్యక్రమం ప్రిన్సిపాల్ కేఏ రామరాజు అధ్యక్షతన నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల గ్రంథాలయ విభాగం, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో ఆధునిక విద్య – గ్రంథాలయాల పాత్ర అనే అంశంపై వక్తలు మాట్లాడారు. అయ్యంకి వెంకటరమణయ్య జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. తరుచూ పుస్తక ప్రదర్శన కార్యక్రమాలకు వెళ్తుండాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.విశ్వేశ్వరరావు, ఐక్యూఏసీ కన్వీనర్ జి.రాము, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.శంకర్, డిగ్రీ లైబ్రేరియన్ వి.గీత, అసిస్టెంట్ లైబ్రేరియన్ఎం జ్యోతి, పీజీ లైబ్రరీ అసిస్టెంట్స్ జి.రోజాకుమారి, కె.కుసుమ కుమారి, తెలుగు విభాగాధిపతి ఎం శ్రీనివాసరావు, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి ఎన్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ వాలంటీరు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శంకర మఠం వద్ద ఉద్రిక్తత



శంకర మఠం వద్ద గోడ కూల్చిన దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేటలో ప్రసిద్ధ శంకర మఠం వద్ద గురువారం ఉదయం ఉద్రిక్తత చోటు చేసుకుంది. శంకర మఠానికి చెందిన స్థలంలో జేసీబీతో కొందరు గోడను కూల్చి ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని దేవాదాయ శాఖ అధికారులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. దీంతో దేవాదాయ శాఖ జిల్లా అధికారి కూచిపూడి శ్రీనివాస్ ఏలూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ వి.సురేష్ కుమార్‌ను ఆ ప్రాంతానికి పంపి విచారణ చేయాలని ఆదేశించారు. వెంటనే ఆయన శంకర మఠం వద్దకు చేరుకుని జేసీబీతో చేయిస్తున్న పనులను అడ్డుకున్నారు. ఈ మఠం జిల్లా కోర్టు పరిధిలో ఉందని, ఎటువంటి పనులు చేపట్టకూడదని హెచ్చరించి పంపారు. ఆయన వెంట దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధికారులు సీహెచ్ చిన నాగేశ్వరరావు, సతీస్ కుమార్ నల్లూరి, కృష్ణంరాజు, సిబ్బంది ఉన్నారు.